


# తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

౨౯

అన్నమయ్యగారి రచన: (సంపు ౨; ప. ౩౮౭)

బౌళిరాగం - రూపకతాళం

[పల్లవి]

(౧) , సఁ సఁ ని ధ ప ప గ ప దా ప | , గ ప ధా ధ ధపగా గ గ రి స
సం గ ర హి తు డై న గా క శాం త మా త్మ కే ల క లు గు

(౨) , సఁ రిఁ సఁ రిఁ సఁ ని ధ ప ప గ పా ధ రిఁ సఁ ని ధా ప | , గ ప ధ ని ధా ధ ప గ ప గ ధ పా
సం గ ర హి తు డై న గా క శాం త మా త్మ కే ల
గ రి స
క లు గు

(3) , సఁ రిఁ సఁ రిఁ సఁ ని ధ ధ ప ప గ గ ప ప ధ ధ రిఁ రిఁ సఁ ని ధ ప | , ప గ ప గ గ ప ధ సఁ సఁ ని ధ ప గ
సం గ ర హి తు డై న గా క శాం త మా త్మ కే ల
ధ ప గ రి స
క లు గు

(౧) , గ గ ప గ గ రి రి సా రి సా రి గ రి స | , ధ స రి గ రి గ పా ని ధ పా ,
సం గ తె లు గ న ట్టి వా రి జా డ లూ ర కుం డు నా , ,

(౨) , గ గ ని ధ ప గ ప గ ప గ ధ ప గ రిఁ స రి | , ధ స స రి గ రి. గా ప ప గ ప ధ రిఁ సఁ ధ పా ||
సం గ తె లు గ న ట్టి వా రి జా డ లూ ర కుం డు నా

[చరణం]

, ప ప ధా పా ధ పా ధ పా ధా గ ప | ప గ గ గ ధ ప ధ ధ ప గా గ గ రి , , స
వె ల య న గ్గి పొం త ను న్న వె న్న క ర గ కే ల మా ను

, గ గ గా గ ప గా రి సా రి సా రి గ రి స | , ధ స రి గ రి గ పా , , , ,
పె లు చ జ ల్ల తో డి పా లు పే ర కుం డు నా

, ప ప ధా ప ప గ పా ధ సాఁ సఁ | , ప ధ సఁ రిఁ గాఁ గఁ గఁ ప గాఁ రిఁ సాఁ సఁ
అ ల రి య ర డు వ ద్ది తీ గె అం ట బా ర కే ల మా ను

, ధ ధ ధా రిఁ సఁ రిఁ సఁ ని ధా గఁ సాఁ సఁ | , గ ప ధ ని ధా ధ ప గ రి స రి గ ప ధ సఁ || రిఁ గఁ || (సంగ)
చె లు ల స ర స ను న్న వా రి చి త్త మూ ర కుం డు నా

ఇట్లే క్రింది చరణములు :

(౨) బెరసి యినుముతోడి యగ్ని - పెట్టువడక యేల మాను ?
విరులతేనె చూచి తేటి - విడువనేర్చునా ?
ఒరసి యుల్లిగూడి కప్ర - ము గ్రగంధ మేల మాను ?
సిరులతోడ మెలగువారు - చింతలేక వుందురా ? (సంగ)

(3) ఊరిచవుటినేల జలము - లుప్పనుండ కేల మాను ?
ఊరుగాయకడవ బెట్టు - వురులకుండునా ?
కోరి శ్రీవెంకటేశు - కొమ్మ యలమేలుమంగ
జేరకున్న వారికతలు - చెప్పనెట్టు వచ్చును ? || (సంగ)

**లఘుటీక :** సంగరహితుడు = మమతలేనివాడు; సంగతెలుగనట్టి = సన్మార్గము తెలియని; పెలుచన్ = హెచ్చుగా; చల్ల = మజ్జిగ; అలరి = పెద్దదై; అరడు = నిఘంటువుల కెక్కని పదము. ప్రకరణమునుబట్టి మ్రానిబుడమము - ప్రకాండము - అని అర్థము చేయవచ్చును. 'అరటి' శబ్దమున కిదే మూలమేమో ! అరటివలె దీర్ఘమైన బుడముగల ఒకానొక అడవిమ్రానికి 'అరటు' అని కన్నడమున వాడుక కలదు.; ఒరసి = రాచుకొని; ఉప్పనుండక = ఉప్పగానుండక; బెట్టు = గట్టిగా.

**ముద్రిత పాఠములు :** వెలయ నన్ను ; కప్రము గెగంధ ; కడవబెట్టు.

---

## మన్ను

(11వ పేజీ తరువాయి)

పక్క లెక్కడా అంత గుడ్ల వ్యాపారి లేడు. చేతి కింద కూలీల సంఖ్య రెండునుంచి ఆరుదాకా పెరిగింది. నిత్యం అందరికంటె సుబ్బారావే ముందు పనిలో వుండేవాడు.

మరుసటి సంవత్సరం సుబ్బారావుగుడ్లకి గిరాకి ఎక్కువయింది. కోళ్లు పెరిగాయి. మనుషులు తక్కువయారు. ఆడవాళ్లనికూడా పనిలో పెట్టుకున్నాడు. తలితండ్రి కాక అతని కింద పన్నెండుగురు కూలీలు పని చేసేవారు. దొడ్లన్నీ కోళ్లగూళ్లతో నిండాయి. రోజూ గుడ్లను లెక్కించి పద్దులు రాసేందుకు గుమాస్తాలు. అన్నీ బాగానే వున్నాయి. తల్లి కొడుక్కి ప్రపంచధర్మం తెలియదనే విచారించేది. ఇరవై రెండేళ్లొచ్చినా పెళ్లిమాట ఎత్తేవాడుకాదు కొడుకు. సుబ్బారావు దగ్గిర పనిచేసే కూలీలలో లక్ష్మి అందరికంటె చిన్నది. యిరవై ఏళ్లుంటుయి. మనిషి నల్లగా నిగనిగలాడ్తూవుంటుంది. మంచి కండపుష్టిగల మనిషి. లక్ష్మికి తల్లీ తండ్రీ లేరు. మేనత్తదగ్గిర పెరిగింది. సుబ్బారావు కూలీ లంతా ఓ ఎత్తు, లక్ష్మో ఓ ఎత్తు. కూలీలు ఖబుర్లాడుతూ పని చేసేవారు. లక్ష్మి వంచిన తల ఎత్తకుండా పని చేసేది.

సుబ్బారావు లక్ష్మితో మాట్లాడడం వెంకమ్మకి నచ్చేది కాదు. కొడుకు ఏ డబ్బు గలవాడి కూతుర్నో చేసుకోవాలని వెంకమ్మ కోర్కె. అట్లాంటిది యీ పేరు వూరు లేని కూలిమనిషితో కొడుకు మాట్లాడటం ఆవిడకు సరిపడేది కాదు.

ఆరు నెల్లు గడిచాయి. ఒకనాడు సుబ్బారావు తల్లిదగ్గిర కొచ్చి "రేపు నా పెళ్లి. లక్ష్మి నత్తయింట్లో చేసుకుంటున్నాను. రేపు సాయంత్రం వెంట తీసుకొస్తాను. ముందు గది ఖాళీ చెయ్యండి వెనక గదిలో మీరు వుండండి" అని చెప్పి సమాధానానికైనా ఎదురు చూడకుండా వెళ్లిపోయాడు. వెంకమ్మ కుప్పకూలిన ట్లైంది. ఆ కూలిపిల్ల లక్ష్మిని మనసులో తిట్టుకుంది. తన ఆశలన్నీ పేకమేడలు. ఆఖరికి కొడుకు పెళ్లికన్నా రమ్మనలేదు. ముందు గది ఖాళీ చేయమని ఆజ్ఞ. మరునాడు భార్యాభర్తలు వెనుక గదిలోకి చేరారు. పెళ్లయిన మర్నాటి నుంచి అత్త తొక్కిన గుమ్మం కోడలు తొక్కేదికాదు.

ఒకరోజు కొడుకు తల్లిదగ్గర కొచ్చి "మా భోజనా లయింతరువాత నువ్వూ, నాన్నా భోంచెయ్యకూడదు?" అన్నాడు. తల్లి నిశ్చేష్టురాలయింది. "నువ్వు ఆ కూలిదానికోసం మమ్మల్ని ఆజ్ఞ పెడ్తావా?" అని అడుగుదామని అనుకుంది. కాని కొడుకుది కర్కశహృదయం అని ఏనాడో తేటతెల్లమయింది. తన మాటలకు విలువలేదు. కొడుకుమాటప్రకారం నడుచుకోవాలి.

మరో ఆరునెల్లు గడిచింది. మధ్యాహ్నం కొడుకు భోంచేశాడు. అమ్మా నాన్నా వున్న గది గుమ్మందగ్గరికి వొచ్చాడు.

"మీ రీ యిల్లు విడిచి వెళ్తే మంచిది" అనాడు. "అదేమిటి!" అన్నారు తల్లీ తండ్రులు నిస్తేజులై.

"మీరు వెళ్లండి" అన్నాడు సుబ్బారావు

"ఎక్కడికి?"

"రావిచెట్టు పక్క వున్న సత్రంలో వుంటండి."

"ఎక్కడికి పోను నాయనా. నిన్నే నమ్ముకున్నాం. యీపంచనే పడివుంటాం" అన్నారిద్దరు

"ఇది నాయిల్లు. యింకోగంటలో లారీ వస్తుంది మూటాముల్లే పద్దుకు సిద్ధంగా వుండండి." అంటూ గుమ్మంలోంచి వెళ్లిపోయాడు.

కోటయ్యకి వెంకమ్మకి నోట మాట లేదు కొడుకు ఏలాటి మందకొడో యీనాడు తెలుసుకున్నారు. ఇద్దరూ వారి మూటలు చేతపట్టుకున్నారు. వెంకమ్మ చేతిలో ముంత.

కొడుకు లారీ తీసుకొచ్చాడు. వృద్ధులు లారీ ఎక్కారు. వూరి చివర సత్రం దగ్గిర లారీ ఆగింది. రావిచెట్టు నీడలో రెండు మూటలు యిద్దరు వృద్ధులూ, ముంతా దిగవిడిచాడు కొడుకు. వెనక్కి తిరిగి చూడకుండా వెళ్లిపోయాడు ఆ వూరికి పాతికేళ్ల క్రితం వారల్లాగే వచ్చారు. కోటయ్య రోడ్డుదుమ్మును గుప్పెటతో తీసి వెళ్ల మధ్యనుంచి కిందికి వదుల్తున్నాడు.

"ఏమిటి ?" అంది వెంకమ్మ రుద్ధకంఠంతో.

"ఇది మిగిలింది" అన్నాడు మన్ను భార్యకు చూపిస్తూ.